సాక్షి చిత్తూరు

బుధవారం । 11 । సెప్టెంబర్ । 2024



వసతి గృహం.. ప్రయోగాల శిబిరం

పచ్చదనం.. పరిశుభ్రత..ఆహ్లాదకర వాతావరణం.. ఉత్తమ ఫలితాల సాధన.. ఆ వసతి గృహం సొంతం. - 8లో



పాత కక్షలతో దారి మూసివేత

ఐరాల మండలం కామినాయునిపల్లెలో పాత కక్షలతో దారి మూసివేశారు. బాధితులు ధర్నాకు దిగారు. - 8లో



టీచర్లు బాధ్యతగా పని చేయాలి

ఉపాధ్యాయులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ సూచించారు. - 8లో

న్యూస్‌రీల్

జాబ్‌మేళాలో 34 మంది ఎంపిక

పుంగనూరు: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఐటీఐ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో 34 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఐటీఐ ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి మంగళవారం తెలిపారు. ప్లేస్‌మెంట్ అధికారి యుగంధర్‌బాబు, జిల్లా అధికారులు చైతన్య, లోకేష్, పవన్‌కుమార్, సుబ్రమణ్యం, రెడ్డెమ్మ ఆధ్వర్యంలో పలు కంపెనీల ప్రతినిధులు జాబ్‌మేళాలో పాల్గొని, ఇంటర్వ్యూలు నిర్వహించారు. జాబ్‌మేళాకు 68 మంది హాజరుకాగా అందులో 34 మందిని ఎంపిక అయినట్లు ఆయన తెలిపారు.

ఏడు నెలలు జీతాలివ్వకపోతే ఎలా?



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఆయాలకు ఏడు నెలలుగా జీతాలు ఇవ్వకపోతే ఎలా? అని ఆయమ్మ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జయకుమారి ప్రశ్నించారు. మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఏడు నెలలుగా ఆయాలకు జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబాలను పోషించుకోలేక పోతున్నారన్నారు. చిరుద్యోగులకు సర్కారు జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టడం సరైన పద్ధతి కాదన్నారు. వెంటనే జీతాలు మంజూరు చేయకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం డీఈఓ దేవరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, ఏఐటీయూసీ నగర కార్యదర్శి దాసరి చంద్ర, వర్కింగ్ అధ్యక్షులు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

గ్రేడ్-2 వీఆర్వోల బదిలీల కౌన్సెలింగ్ రేపు

చిత్తూరు కలెక్టరేట్ : గ్రామ,వార్డు సచివాలయాల గ్రేడ్-2 వీఆర్వోల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్నట్టు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రేడ్ 2 వీఆర్వోలకు కౌన్సెలింగ్ నిర్వహించి, బదిలీలు చేస్తామన్నారు. ఈ నెల 12వ తేదీ ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకున్న గ్రేడ్ 2 వీఆర్వోలు హాజరుకావాలని కలెక్టర్ కోరారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 25 ఫిర్యాదులు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: జిల్లా కేంద్రంలోని జిల్లా ఆర్ముడు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమానికి 39 ఫిర్యాదులు అందాయి. మంగళవారం ఎస్పీ మణికంఠ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ఇందులో కుటుంబ తగాదాలు, వేధింపులు, డబ్బు తగాదాలు, భూ తగాదాలు, ఆస్తి తగాదాలకు సంబంధించినవి ఉన్నాయి. వచ్చిన ప్రతి ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వీటిని ఆన్‌లైన్‌లో సైతం నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ సైతం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

సాహితీ పురస్కారాలకు కవితలు పంపండి

చిత్తూరు కలెక్టరేట్ : గంటా కమలమ్మ సాహితీ పురస్కారాలకు ఆసక్తి ఉన్న కవులు కవితా సంపుటాలను పంపాలని ఆ సంస్థ వ్యవస్థాపకులు, అరసం జిల్లా అధ్యక్షుడు గంటా మోహన్ కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2024 సంవత్సరానికి సంబంధించి గంటా కమలమ్మ సాహితీ పురస్కారాలను అందజేయనున్నట్లు తెలిపారు. 2022, 2023 సంవత్సరాల్లో ముద్రితమైన కవితా సంపుటాలు మూడు ప్రతులను అక్టోబర్ 15వ తేదీలోపు అందజేయాల్సి ఉంటుందన్నారు. ఎంపికయ్యే ఉత్తమ కవితా సంపుటానికి రూ.10 వేలు నగదుతో పాటు, పురస్కారం ప్రదానం చేస్తామని చెప్పారు. ఆసక్తి ఉన్నవారు ఇతర వివరాలకు 9440467311 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.



మూషికంపై మోక్షప్రదాత విహారం

- వైభవంగా వరసిద్ధుడి వార్షిక బ్రహ్మోత్సవాలు
- భక్తిశ్రద్ధలతో కొలిచి, పరవశించిన భక్తులు

కాణిపాకం: వరసిద్ధి వినాయక క్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన మంగళవారం స్వామివారు మూషికంపై విహరించారు. భక్తులు విఘ్నేశ్వరుని కనులారా వీక్షించి, పరవశించారు. విఘ్నాలు తొలగించే.. వినాయకా.. చల్లగా కాపాడాలంటూ భక్తులు వేడుకున్నారు. ఉదయం ఆలయంలోని మూలవిరాట్‌కు శాస్త్రోక్తంగా పండ్ల రసాలు, సుంగధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించి, భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి సిద్ధి..బుద్ధి సమేత వినాయకస్వామివారి ఉత్సవమూర్తులను మండపంలోకి వేంచేపు చేసి, విశేషాలంకరణ చేశారు. వేదమంత్రోచ్చారణల నడుమ విశేష పూజలు జరిపారు. అనంతరం ఉత్సవమూర్తులను మూషిక వాహనంపై కొలువుదీర్చి మంగళ వాయిద్యాలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనల నడుమ పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారిని భక్తిశ్రద్ధలతో కొలిచి, పునీతులయ్యారు. ఈ సేవకు కాణిపాకం, తిరువణంపల్లె, అగరంపల్లె, కాణిపాకం పట్నం, వడ్రాంపల్లె, కొత్తపల్లె, చినకాంపల్లె గ్రామస్తుల విశ్వకర్మ వంశస్తులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఈఓ గురుప్రసాద్, ఆలయ ఏఈఓలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు చిన్న, పెద్ద శేష వాహన సేవలు

వరసిద్ధుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి క్షేత్రంలో బుధవారం బంగారు చిన్న, పెద్ద శేష వాహన సేవలు జరగనున్నాయి. ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించనున్నారు. రాత్రి బంగారు పెద్ద శేషవాహన సేవకు కాణిపాకం, కాకర్లవారిపల్లె, వడ్రాంపల్లె, మిట్టిండ్లు, కొత్తపల్లె, అడపగుండ్లపల్లె, 44బొమ్మసముద్రం, తిమ్మోజిపల్లె, తిరువణంపల్లె, చిగరపల్లె, అగరంపల్లె గ్రామాల్లోని కమ్మ వంశస్తులు ఉభయకర్తలుగా వ్యవహరించనున్నారని ఆలయాధికారులు తెలిపారు.

ఊరుగానీ ఊళ్లో ఓ వ్యక్తి హఠాత్తు మరణం.. ఆ కుటుంబానికి తీరని శోకం.. ఏమీ చేయాలో దిక్కుతోచని స్థితి.. బంధువులు, ఆప్త మిత్రుల చొరవతోనే అన్ని లాంఛనాలు జరగాల్సిన స్థితి. ఆ సమయం డెత్ సర్టిఫికెట్‌కు వివరాలు అక్కడే నమోదు చేయించాలన్న ఆలోచనే గగనం. తేరుకున్న అనంతరం ఆ మరణ ధ్రువపత్రం పొందడం దుర్భరమవుతోంది. నాయకుల సిఫార్సులతోనో.. దళారులను ఆశ్రయించి, లంచాలు ఇచ్చో తెచ్చుకోవాల్సిన దుస్థితి కలుగుతోంది. ఫలితం మార్గ మధ్యంలో మరణించిన వ్యక్తుల కుటుంబ సభ్యుల మరణరోదన మిగులుతోంది.

ధ్రువపత్రం.. దుర్భరం




- రెండేళ్ల క్రితం ఎస్‌ఆర్‌పురం మండలానికి చెందిన నిత్య (పేరుమార్చాం) మార్గం మధ్యలో చనిపోయారు. అనారోగ్య సమస్యతో బాధపడుతున్న ఈయన్ని కుటుంబసభ్యులు తొలుత చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి తిరుపతికి తీసుకెళుతుండగా మురకంబట్టు వద్ద మరణించాడు. ఆ తర్వాత డెత్ సర్టిఫికెట్ కోసం పంచాయతీ ఆఫీసుకు వెళితే మరణించిన ప్రాంతంలోనే తీసుకోవాలని తేల్చి చెప్పారు. అక్కడికి వెళితే తమకు సంబంధం లేదని చేతులెత్తేశారు. నెల రోజుల పాటు అవస్థ పడి చివరకు పంచాయతీ అధికారులను బ్రతిమలాడుకుని మరణ ధ్రువీకరణ పత్రం అందజేశారు.
- జూలైలో చిత్తూరు మండలానికి చెందిన పెరియబ్బ అనారోగ్యానికి గురికాగా జిల్లా ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మార్గంమధ్యలోనే చనిపోయినట్లు నిర్ధారించారు. తర్వాత డెత్ సర్టిఫికెట్ కోసం పంచాయతీ కార్యదర్శిని ఆశ్రయించారు. చనిపోయిన చోట తీసుకోవాలన్నారు. ఆస్పత్రి అధికారుల వద్దకు వెళితే ఇక్కడ మరణించినట్లు డాక్టర్లు డెత్ సమ్మరీ ఇచ్చి ఉంటే దాని ఆధారంగా ఇస్తామని చెప్పారు. అక్కడకు వెళితే ఇక్కడ చనిపోయినట్లు ఆధారాలు అడిగారు. చేసేదీ లేక సర్టిఫికెట్ తీసుకోలేదు.
- ఆగస్టు 21వ తేదీన బంగారుపాళెం మండలానికి చెందిన మురగయ్య ద్విచక్రవాహనంపై వెళుతూ సంక్రాంతిపల్లె వద్ద వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. స్థానికులు అతడిని చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా చనిపోయాడు. వారం రోజుల తర్వాత అతని భార్య వితంతు పింఛన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు డెత్ సర్టిఫికెట్ కోసం పంచాయతీ కార్యదర్శిని ఆశ్రయించింది. ఎక్కడ చనిపోయి ఉంటే అక్కడే తీసుకోవాలని తేల్చి చెప్పారు. చనిపోయిన పంచాయతీకి చెందిన కార్యదర్శి వద్దకు వెళితే తమకు సంబంధం లేదని సమాధానం ఇచ్చాడు. చివరకు ఓ నాయకుడి సిఫార్సుతో పత్రం తీసుకోవాల్సి వచ్చింది.
- చిత్తూరు మండలానికి చెందిన మున్నెమ్మ అనారోగ్యంతో మూడేళ్లకు కిత్రం చనిపోయింది. ఆ తర్వాత డెత్ సర్టిఫికెట్ తీసుకోకుండా వదిలేశారు. మూడు నెలల కిందట చిత్తూరు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి మరణాల నమోదు రిజిస్ట్రేషన్‌ను క్షుణ్ణంగా పరిశీలిస్తే ఆ వివరాలు లేవు. అధికారుల సూచనల మేరకు ఆ వృద్ధ భర్త నానా అగచాట్లు పడి మీ సేవలో దరఖాస్తు చేసుకోవడానికి వారం రోజులు పట్టింది.

- మార్గం మధ్యలో చనిపోతే ధ్రువీకరణకు కష్టాలే!
- కార్యాలయాల చుట్టూ బాధిత కుటుంబ సభ్యుల ప్రదక్షిణలు
- రెచ్చిపోతున్న దళారులు
- పట్టించుకోని అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ప్రస్తుతం కుటుంబంలో ఓ వ్యక్తి మరణిస్తే అతడి మరణ ధ్రువీకరణ పత్రం ఆ కుటుంబానికి విధిగా అవసరమవుతోంది. సహజ, రోడ్డు, ఇతర ప్రమాదంలో మరణిస్తే ధ్రువీకరణపత్రాలు నిబంధనల మేరకు వచ్చేస్తున్నాయి. అయితే మార్గంమధ్యలో చనిపోతే ఆ మనిషి మరణ ధ్రువపత్రం పొందడానికి పడే కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

అవగాహనలేమితో కష్టాలు

జిల్లాలో అధిక శాతం మందికి మరణ ధ్రువీకరణ పత్రం పొందడంపై పూర్తి స్థాయిలో అవగాహన కొరవడుతోంది. దీంతో బాధిత కుటుంబ సభ్యులకు కష్టాలు తప్పడం లేదు. ఓ వ్యక్తి వేరే ప్రాంతంలోని మార్గంమధ్యలో ఏ కారణంతోనైనా చనిపోతే మరణ ధ్రువీకరణ పత్రం తీసుకోవడానికి ఆ కుటుంబ సభ్యులు ఇక్కట్లు పడాల్సి వస్తోంది. మనిషి పోతే శోకసంద్రంలో మునిగిన కుటుంబ సభ్యులకు ఆ సమయంలో మరణధ్రువీకరణ పత్రం గురించి పట్టించుకునే ఆలోచన రాదు. అయితే ఆ తర్వాత డెత్ సర్టిఫికెట్ తీసుకోవడం చాలా కష్టమవుతోంది.



ఫారం-2

మార్గ మధ్యంలో నెలవారీగా మరణాల సంఖ్య... (అధికారుల లెక్కల ప్రకారం)

నెల	పురుషులు	స్త్రీలు	ఇతరులు
ఏప్రిల్	555	378	01
మే	465	307	0
జూన్	624	355	0
జూలై	720	479	0
ఆగస్టు	716	472	0

మార్గం మధ్యలో చనిపోతే..

మార్గమధ్యంలో అనారోగ్యం, ప్రమాదవశాత్తు మరణిస్తే..అక్కడున్న అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాలి. లేదా పోలీస్ స్టేషన్‌కు వివరాలు అందించాలి. దీనికి తోడు ఫారం-2 పూర్తి చేసి ఇవ్వాలి. ఖననం పూర్తయిన తర్వాత మరణించిన ప్రాంతంలోని సచివాలయంలో మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేయాలి. అయితే చాలా మంది అధికారులు ఇవి చేయడం లేదు.

రికార్డులకు ఎక్కితే ఒట్టు..

పల్లెలో సహజ, ఏ ఇతర కారణంతో చనిపోయినా కొంత మంది వివరాలు రికార్డుల్లో నమోదు కావడంలేదు. అవసరమైన వారికి మాత్రమే పత్రం ఇస్తూ..మిగిలిన వ్యక్తుల వివరాలను నమోదు చేయడంలో పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఏ వ్యక్తి మరణించినా వారి ఆధార్, ఇతర వివరాలను సేకరించి పింఛన్లు, ప్రభుత్వ పథకాలను తొలగించడంలో చక్కుమని స్పందిస్తున్నారు. కానీ మరణ ధ్రువీకరణపత్రం ఇవ్వడం, మంజూరుపై అవగాహన కల్పించడంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

అవసరాలివీ..

కుటుంబ యజమాని, కుటుంబ సభ్యులు ఎవరైనా చనిపోతే వారి ఆస్తులు, రేషన్‌కార్డు, ప్రభుత్వ పథకాలు వర్తింపు, గ్యాస్, బీమా, మృతుడి బ్యాంకు ఖాతాలోని నగదు తదితరాలు కుటుంబ సభ్యుల పేరున మార్చుకోవడానికి మరణ ధ్రువీకరణ పత్రం అవసరమవుతోంది.

దళారుల కాసుల వేట



మరణ ధ్రువీకరణ పత్రాల కష్టాలను ఆసరాగా చేసుకుని కొందరు దళారులు కార్యాలయాల ఎదుట పాగా వేస్తున్నారు. మరణ ధ్రువీకరణ పత్రం కోసం వచ్చే బాధిత కుటుంబ సభ్యులను కార్యాలయంలో అడుగు పెట్టనివ్వకుండా దళారులు అంతా తామై వ్యవహరిస్తున్నారు. మరణించిన సమయంలోనే సర్టిఫికెట్ తీసి ఇస్తే, రూ.2వేల నుంచి రూ.10వేల వరకు వసూలు చేస్తున్నారు. మరణించినట్లు రికార్డుల్లో నమోదు కాకుంటే, అలాంటి వారికి మరణ ధ్రువీకరణ పత్రాల మంజూరుకు రూ.10 వేలు ఫిక్స్ చేశారు. దీనిపై జిల్లాలో పలు చోట్ల ఫిర్యాదులు వెలువెత్తుతున్నాయి.

వివరాల నమోదు తప్పనిసరి



మరణించిన వ్యక్తి వివరాలను ఎప్పటికప్పుడు డెత్ రిజిస్టర్‌లో నమోదు చేయాలి. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు. పంచాయతీ పరిధిలో ఏ వ్యక్తి ఎప్పుడు చనిపోయారో.. సమయంతో సహా విధిగా నమోదు చేయాలి. ఏ కారణంతో చనిపోయారో వివరాలు ఉండాలి. మార్గం మధ్యలో, ఇతర ప్రాంతాల్లో చనిపోతే వివరాలు సేకరించి, బరియల్ సర్టిఫికెట్ ఇవ్వొచ్చు. దాని ఆధారంగా కూడా చనిపోయిన ప్రాంతంలో సర్టిఫికెట్ తీసుకునే వెసులుబాటు ఉంటుంది. డెత్ సర్టిఫికెట్ ఇవ్వడంలో బాధిత కుంటుంబ సభ్యులకు ఇబ్బంది కలిగించవద్దు. ముఖ్యమైన విషయం ఏమిటంటే.. ఎక్కడ చనిపోయినా అక్కడి పంచాయతీ కార్యదర్శికి సమాచారం అందించి, వివరాలు తెలియజేయాలి. ఫారం-2ను పూర్తి చేసి ఇవ్వాలి.

–లక్ష్మి, డీపీఓ, చిత్తూరు

అవగాహన అవసరం



రోడ్డు ప్రమాదంలో చనిపోతే, ఎక్కడైతే చనిపోయారో అక్కడే సర్టిఫికెట్ ఇస్తారు. ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటూ మరణిస్తే ఆస్పత్రిలోనే పత్రం తీసుకోవచ్చు. ఇలాంటప్పుడు డాక్టర్ నుంచి కాజ్ ఆఫ్ డెత్ తీసుకోవాలి. దాని ఆధారంగా ఆస్పత్రిలోనే డెత్ సర్టిఫికెట్ తీసుకోవచ్చు. మార్గం మధ్యలో చనిపోతే ఆ ప్రాంత పరిధిలోనే సర్టిఫికెట్ తీసుకోవచ్చు. ఆ పరిధి అధికారులు, వైద్య సిబ్బంది విషయం తెలియజేయాలి.

–రాజశేఖర్, డీసీహెచ్‌ఎస్, చిత్తూరు

కలికిరి కార్యదర్శి సస్పెన్షన్

చిత్తూరు కార్పొరేషన్/ పెనుమూరు(కార్వేటినగరం): పెనుమూరు మండలం చిన్న కలికిరి పంచాయతీ కార్యదర్శి లావణ్యను కలెక్టర్ ఆదేశాల మేరకు సస్పెన్షన్ చేసినట్లు డీపీఓ లక్ష్మి తెలిపారు. ఆమెపై వచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కలికిరి సచివాలయంలో విచారణ చేశామన్నారు. రూ.1.70 లక్షల నిధుల దుర్వినియోగం చేసినట్లు తేలిందన్నారు. దీనిపై కలెక్టర్‌కు నివేదిక ఇవ్వగా సస్పెండ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారని వివరించారు. టీడీపీ నేతల ఒత్తిళ్లతో సస్పెండ్ చేశారన్న ఆరోపణలు వచ్చాయి.

జేసీబీ సీజ్

గంగవరం: మండలంలోని కౌండిన్య నదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలకు వినియోగించిన జేసీబీని గంగవరం పోలీసులు సీజ్ చేసి, స్టేషన్‌కు తరలించారు. కౌండిన్య నది ఇసుక తరలిస్తున్నట్టు సమాచారం అందడంతో పోలీసులు దాడులు చేసి, జేసీబీని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు.

వైఎస్సార్‌సీపీ నేతలకు సీఐ బెదిరింపులు

- పార్టీ కేడర్‌ను స్టేషన్‌కు పిలిపించి దబాయింపు
- చిత్తూరులో సీఐ నెట్టికంఠయ్య వివాదస్పద వైఖరి
- సీఐ అవినీతిని ఎండగడతామన్న వైఎస్సార్‌సీపీ



చిత్తూరు అర్బన్: స్థానిక టూటౌన్ సీఐగా ఇటీవల బాధ్యతలు తీసుకున్న సీఐ నెట్టికంఠయ్య వైఖరిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులే లక్ష్యంగా, వాళ్లను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి దబాయించడం, గంటల కొద్దీ స్టేషన్‌లో కూర్చోబెట్టడం, బహిరంగంగా టీడీపీపై అభిమానాన్ని చూపిస్తూ పోలీసుశాఖకు మచ్చను తెచ్చిపెడుతున్నారు. ఈయన వివాదస్పద వైఖరిపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంసీ విజయానందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఫిర్యాదు లేకున్నా స్టేషన్‌కు..

చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కో–ఆప్షన్ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉన్న ముస్లిం మైనారిటీ నాయకుడు అనూను మంగళవారం సీఐ పిలుస్తున్నారంటూ పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లారు. అనూపై ఎవరూ ఎలాంటి ఫిర్యాదు చేయకున్నా.. స్టేషన్‌లో గంటల కొద్దీ కూర్చోబెట్టారు. గంగనపల్లెలో ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో నాలుగేళ్ల క్రితం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తే.. ఇపుడు దాన్ని మూసేయాలని సీఐ హుకుం జారీ చేశారు. కేవలం స్థానిక టీడీపీ నాయకుల ఆదేశాల మేరకే సీఐ నెట్టికంఠయ్య ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ వైఎస్సార్‌సీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల దుర్గానగర్ కాలనీలో అక్కడి స్థానిక టీడీపీ నాయకుడు రోడ్డుకు అడ్డుగా కొయ్యలు పెట్టడంతో ప్రజలకు ఇబ్బందులు పడ్డారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఘటనా స్థలానికి వెళ్లిన సీఐ ప్రజల్నే బెదిరిస్తూ భయభ్రాంతులకు గురిచేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

కార్యకర్తల జోలికొస్తే సహించం..

సీఐ వ్యవహారంపై చిత్తూరు వైఎస్సార్‌సీపీ నాయకులు విజయానందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తలు జోలికి వస్తే సహించేదిలేదని, అలాంటి పోలీసులపై చట్టపరంగా ముందుకు వెళతామన్నారు. నెట్టికంఠయ్య చిత్తూరులో ఎస్ఐగా పనిచేసిన సమయంలో చేసిన దందాలు, ఇపుడు సీఐగా వచ్చిన తరువాత చేస్తున్న అవినీతి అక్రమాలు అన్నీ బయటకొస్తాయన్నారు. బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్నామని, దీనిపై ఎస్పీకి సైతం ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. టూటౌన్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న పేకాట క్లబ్‌లు, కర్ణాటక మద్యం విక్రయాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు దన్నుగా ఎవరు నిలుస్తున్నారనే విషయాలు ప్రజలందరికీ తెలుసన్నారు. ఆ వివరాలు కూడా త్వరలోనే సాక్ష్యాధారాలతో సహా ప్రజల ముందు ఉంచుతామన్నారు. పార్టీ కార్యకర్తలను వేధింపులకు గురిచేయడంపై రాష్ట్ర పార్టీ లీగల్ విభాగంతో మాట్లాడి సంబంధిత పోలీసు అధికారులపై చర్యలకు చట్టపరంగా ముందుకు వెళతామని విజయానందరెడ్డి స్పష్టం చేశారు.

మాతాశిశు మరణాలు నివారించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో మాతాశిశు మరణాలను నివారించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. మాతాశిశు మరణాలపై మంగళవారం కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు జరిగిన మాతాశిశు మరణాలకు గల కారణాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్‌లో మాతాశిశు మరణాలు జరగకుండా పకడ్బందీ ప్రణాళికలు అమలు చేయాలన్నారు. ఏ మాత్రం అలసత్వం వహించినా చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న హైరిస్క్ గర్భిణులను ముందస్తుగా గుర్తించి చికిత్సలు అందించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగేలా చూడాలని, ప్రసవాంతర వైద్యసేవలు కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. లక్ష్యాలను నూటికి నూరు శాతం సాధించాలన్నారు. రక్తహీనతపై అధికంగా దృష్టి పెట్టాలన్నారు. గ్రామీణ స్థాయిలో హైరిస్క్ గర్భిణులకు అన్ని పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. కాన్పుకు వారం రోజులు ముందుగా ప్రభుత్వాస్పత్రుల్లో చేర్పిస్తే ఆర్థిక ఉచిత రవాణా కల్పించడం జరుగుతుందన్నారు. బిడ్డకు మరో బిడ్డకు కనీసం మూడేళ్ల కాలవ్యవధి ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమీక్షలో డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి, డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్‌రెడ్డి, డీఐఓ హనుమంతరావు పాల్గొన్నారు.

అతిథి టీచర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో అతిథి టీచర్లుగా పనిచేసేందుకు అర్హత, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కోఆర్డినేటర్ పద్మజ తెలిపారు. ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ఐదు గురుకుల పాఠశాలల్లో 2024-25 విద్యాసంవత్సరానికి ఇంగ్లిషు మాధ్యమంలో బోధించేందుకు అతిథి టీచర్లను నియమించనున్నట్లు చెప్పారు. అభ్యర్థులు బీఈడీతోపాటు టెట్ అర్హత సాధించి ఉండాలన్నారు. పీజీలో 55 శాతం మార్కులు, బీఈడీలో సంబంధిత సబ్జెక్టు మెథడాలజీ ఉండాలని తెలిపారు. మహిళా కోటాలో జేఎల్ ఇంగ్లిషు, జేఎల్ ఫిజిక్స్, జేఎల్ కామర్స్, ఈజీటీ సోషల్ స్టడీస్, టీజీటీ హిందీ పోస్టులు ఒక్కొక్కటి వంతున ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే టీజీటీ సోషల్ స్టడీస్ 2, పీఈటీలు 2 ఉన్నాయన్నారు. పురుషుల కోటాలో జేఎల్ ఫిజిక్స్, పీజీటీ సోషల్, టీజీటీ హిందీ, టీజీటీ ఇంగ్లిషు, టీజీటీ గణితం, టీజీటీ ఫిజిక్స్, పీఈటీ పోస్టులను భర్తీ చేయనున్నట్లు చెప్పారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 13వ తేదీ లోపు జిల్లా కేంద్రంలోని ఎంప్లాయిమెంట్ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న జిల్లా డీసీఓ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు. ఈ నెల 17వ తేదీన సంజయ్‌గాంధీ నగర్‌లోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ కళాశాలలో డెమో తరగతులు నిర్వహించి, ఎంపికలు చేస్తామని ఆమె వెల్లడించారు.

క్లుప్తంగా

గజేంద్ర స్వాగతం

- ముఖద్వారం వద్ద కృత్రిమ గజేంద్రుల ఏర్పాటు



కృత్రిమ గజేంద్రుని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఈఓ

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం వీవీపీ ముఖద్వారం వద్ద మంగళవారం కృత్రిమ ఏనుగును ఏర్పాటు చేశారు. ఇందుకు ఎలక్ట్రానిక్ పరికరాన్ని జోడించి..స్వాగతం పలికేలా అమర్చారు. అలాగే ఏనుగు కీంకార శబ్దం వచ్చేలా తీర్చిదిద్దారు. ఈ ఏర్పాటును ఎమ్మెల్యే మురళీమోహన్, ఈఓ గురుమూర్తి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సిబ్బంది కోదండపాణి, వాసు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి



వినోద్‌కుమార్ మృతదేహం

నగరి : నింద్ర పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వినోద్‌కుమార్ (32) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మంగళవారం మధ్యాహ్నం పుత్తూరు నుంచి వినోద్‌కుమార్ నగరికి ద్విచక్రవాహనంలో వస్తుండగా మార్గంమధ్యలో ఫ్రైడిస్ హోటల్ వద్ద ఎదురుగా వస్తున్న సిమెంట్ లారీ, మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తూ అదుపు తప్పి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో వినోద్ కుమార్ సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. నగరి మున్సిపల్ పరిధి నెత్తం కండ్రిగకు చెందిన వినోద్‌కుమార్ పిచ్చాటూరు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఇటీవలే బదిలీపై నింద్ర పోలీస్ స్టేషన్‌కు విచ్చేశారు.

వసతి గృహం.. ప్రయోగాల శిబిరం

పచ్చదనం.. పరిశుభ్రత.. ఆహ్లాదకర వాతావరణం.. పోషకాహారం.. ఉత్తమ ఫలితాలు.. క్రమశిక్షణ.. మొత్తంగా చెప్పాలంటే అది ఓ ప్రయోగశాల. అక్కడున్న విద్యార్థులు చదువుతోపాటు సంప్రదాయం.. ప్రకృతి సేద్యంలో నైపుణ్యం సాధిస్తున్నారు. వసతి గృహంలోనే ఆకు కూరలు, కూరగాయలు సాగు చేస్తూ, వాటితో వంట చేయించుకుని, కమ్మని రుచికరమైన భోజనం చేస్తున్నారు. పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు పూతలపట్టు ఎస్సీ వసతి గృహం విద్యార్థులు. దీనంతటికీ వసతి గృహ సంక్షేమాధికారి ప్రత్యేక శ్రద్ధ, సేవా భావం.. విధి నిర్వహణలో చిత్తశుద్ధే కారణం.

వసతిలో ఆదర్శం

- హాస్టల్ ఆవరణలో కూరగాయల తోట సాగు
- అక్కడే పండిన కూరగాయలతో వంట
- చదువుతో పాటు వ్యవసాయంలో శిక్షణ
- ఉత్తీర్ణతలోనూ ఆదర్శంగా విద్యార్థులు

పూతలపట్టు: వసతి గృహ విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించి హాస్టల్ ఆవరణలో కూరగాయలు పండించి, విద్యార్థులకు వడ్డించాలన్న పూతలపట్టు వసతి గృహ అధికారి జయచంద్రారెడ్డి ఆశయం నెరవేరింది. 2022 జూలైలో పూతలపట్టు వసతి గృహ అధికారిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం రెండేళ్లలో పెనుమార్పులను తీసుకొచ్చారు. హాస్టల్ ఆవరణలో ఉన్న ఖాళీ స్థలాన్ని శుభ్రపరిచి అందులో వివిధ రకాల కూరగాయలు పండించి, వాటితోనే విద్యార్థులకు భోజనం చేసి, వడ్డిస్తున్నారు. పరిశుభ్రత, పచ్చదనానికి శ్రీకారం చుట్టి సాంఘిక సంక్షేమానికి శ్రీకారం చుట్టారు. ఈయన రాకతో వసతిగృహంలో విద్యార్థులు క్రమశిక్షణకు మారు పేరు తెచ్చారు. తన సొంత ఖర్చులతో వసతి గృహ ఆవరణాన్ని శుభ్రపరిచి పిల్లలకు సౌకర్యాలను కల్పిస్తున్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు వారికి సహజసిద్ధమైన కూరగాయలతో భోజనం అందిస్తున్నారు. వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.

వివిధ రకాల కూరగాయలు

పూతలపట్టు ఎస్సీ వసతిగృహం ఆవరణలోని ఖాళీ స్థలంలో వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు పండుతున్నాయి. దాదాపు రెండేళ్లలో రాళ్లతో నిండిన భూమిని రతనాల పుడమిగా మార్చి, పలు రకాల మొక్కలను పెంచారు. అరటి తోటను సైతం సాగు చేస్తున్నారు. ఎటువంటి రసాయనిక ఎరువులు ఉపయోగించకుండా పశువుల ఎరువులను వినియోగించడంతో అరటి చెట్లు ఏపుగా పెరిగాయి. నేడు పక్వానికి రావడంతో వసతిగృహంలో విద్యార్థుల రోజు అరటి పండును తింటున్నారు. అంతేగాక మిగిలిన భూమిలో మునగ, గోంగూర, పుదీనా, కొత్తమీర, కరివేపాకు, వంకాయ, పచ్చిమిర్చి, టమాట తదితర కూరగాయలను పండిస్తున్నారు. ఇక్కడ సహజ సిద్ధంగా పండిన కూరగాయలు, ఆకుకూరలతో 75 మంది విద్యార్థులకు రుచికరంగా భోజనం అందిస్తున్నట్లు వసతిగృహ అధికారి తెలిపారు. వీటి సస్యరక్షణ బాధ్యత ప్రతి ఆదివారం విద్యార్థులు ఒక్కో తరగతి చొప్పున తీసుకుంటున్నారు. ఆరునెలల క్రితం రాష్ట్ర ఆహార, భద్రత కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డి తనిఖీలో భాగంగా పూతలపట్టు వసతి గృహాన్ని పరిశీలించి విద్యార్థులు తిన్న ఆహారాన్ని రుచి చూసి.. తాను తిన్న హాస్టల్‌లో పూతపట్టు హాస్టల్ రుచిలో బాగుందని, వంట చేసిన వంటమనిషి దాముకు శాలువ కప్పి, సన్మానించారు.



చదువుకుంటున్న విద్యార్థులు



వంటమనిషిని సన్మానిస్తున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి(ఫైల్)

పొదుపుగా నీటిని వాడకం



హాస్టల్ ఆవరణలో సాగు చేసిన అరటి తోట

వసతి గృహంలో ఏర్పాటు చేసిన కూరగాయలు, ఆకుకూరలకు బిందు సేద్యం పద్ధతిలో మొక్క, మొక్కకు అందిస్తున్నారు. కాలువ రూపంలో నీటిని అందిస్తే నీరు ఎక్కువగా వృథా అవుతుందనే ఉద్దేశంతో ఈ పద్ధతిని పాటిస్తున్నారు. అంతేగాక విద్యార్థులు స్నానం చేసిన నీరు వృథాగా పోకూడదనే ఆలోచనతో ఆ నీటిని అరటి, మునగ చెట్లకు సరఫరా చేస్తున్నారు. వసతిగృహ అధికారి విద్యార్థులకు చదువుతో పాటు వ్యవసాయం, నీటి ఆవశ్యకతపై ప్రతి రోజు అవగాహన కల్పిస్తున్నారు. కూరగాయలు, ఆకూకురలను విద్యార్థులే స్వయంగా వార్డెన్ సహాయంతో పండిస్తున్నారు. ఆదునిక ప్రపంచంలో విద్యార్థులు వ్యవసాయాన్ని మరిచిపోకూడదనే ఉద్దేశంతో వారికి ఈ ప్రయోగాలు చేసి చూపిస్తునట్లు తెలిపారు. చదువుల్లో కూడా హాస్టల్ విద్యార్థులు ముందంజలో ఉన్నారు. ఇంట్లో నుంచి పాఠశాలకు వచ్చే విద్యార్థులతో పోల్చుకుంటే హాస్టల్ విద్యార్థులకు ప్రత్యేకంగా చదువుకోవడానికి సమయాన్ని కేటాయించారు. వార్డెన్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, వారి ఆలోచనలకు అనుగుణంగా చిన్నారులను ప్రోత్సహిస్తున్నారు. గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈ సంవత్సరం ఎక్కువ మంది పూతలపట్టు ప్రభుత్వ బాలుర వసతి గృహంలో చేరడానికి ఆసక్తి చూపారు.

భోజనం రుచికరం



హాస్టల్‌లో రోజు పెడుతున్న భోజనం చాలా రుచికరంగా ఉంది. మా కళ్ల ముందర పండిన కూరగాయలతోనే సిబ్బంది మాకు రుచికరమైన వంటలు చేసి పెడుతున్నారు. వ్యవసాయంపై మా వార్డెన్ సార్ ప్రత్యేక దృష్టి పెట్టి మాకు నేర్పిస్తున్నారు. మా హాస్టల్ ఆవరణలో పండుతున్న కూరగాయలు, ఆకుకూరలను మేమే వారానికి ఒక్కో తరగతి చొప్పున బాధ్యతలు తీసుకొని భద్రతగా కాపాడుకుంటు వస్తున్నాం.

– కె. మోక్షిత్, 8వ తరగతి, పూతలపట్టు వసతిగృహం

వ్యవసాయాన్ని మర్చిపోకూడదు



అభివృద్ధి చెందుతున్న నేటి సమాజంలో ప్రజలు వ్యవసాయాన్ని మరిచిపోతున్నారు. విద్యార్థి దశ నుంచే పిల్లలకు వ్యవసాయంపై పట్టు రావాలనే ఉద్దేశంతో నేను పనిచేస్తున్న ప్రతి హాస్టల్‌లో సహజ సిద్ధమైన కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నాను. సేంద్రియంగా పండించిన పంటను విద్యార్థులు తినడంతో వారి జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది. వీలైనంత వరకు నీటిని వృథా చేయకూడదు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి.

– జయచంద్రారెడ్డి, వార్డెన్, పూతలపట్టు

క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించండి

- కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- వివిధ శాఖలకు సంబంధించి 112 అర్జీలు నమోదు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, డీఆర్వో పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారులు మరోసారి ప్రజాసమస్యల పరిష్కార వేదికకు రాకుండా ఉండేలా క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలన్నారు. ఒకసారి వచ్చిన అర్జీదారుడు మరోసారి వచ్చి సమస్య పరిష్కారం కాలేదని చెప్పకూడదన్నారు. అధికారులు అలసత్వం ప్రదర్శించకుండా విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ భవానీ, డీఆర్‌డీఏ పీడీ తులసి, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

112 అర్జీలు నమోదు



అర్జీదారుని సమస్యను వింటున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

వివిధ శాఖలకు సంబంధించి 112 అర్జీలు నమోదైనట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 96 , పశు సంవర్థక శాఖ 1, పోలీస్ 4, డీపీఓ 1, పౌర సరఫరాలు 1, డీఆర్‌డీఏ 2, డీఎంఅండ్‌హెచ్‌ఓ 1, నగరి మున్సిపల్ కమిషనర్ 1 , ఎస్‌ఆర్‌పురం ఎంపీడీఓ 1, వెదురుకుప్పం ఎంపీడీఓ 1, పీఓ సమగ్ర శిక్ష 1, ఏడీ సెంట్రల్ కో– ఆపరేటివ్ బ్యాంక్ 1, ఇరిగేషన్ 1 మొత్తం 112 అర్జీలు అందినట్లు అధికారులు వెల్లడించారు.

డ్రిప్ పరికరాలు ఇవ్వడం లేదు



డ్రిప్ పరికరాలు ఇవ్వడం లేదని వెదురు కుప్పం మండలం ఎస్టీ కాలనీకి చెందిన గిరిజన రైతు ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. తనకు 1.70 ఎకరా పట్టా భూమి ఉందన్నారు. అందులో జీవనాధారం కోసం 90 మామిడి మొక్కలను నాటుకున్నట్లు తెలిపారు. డ్రిప్ పరికరాలు మంజూరు చేయాలని పలు మార్లు మండల వ్యవసాయ శాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని కోరారు.

– రైతు ప్రసాద్

రోడ్డు లేక అవస్థ



తమ గ్రామానికి రోడ్డు లేక పోవడంతో అవస్థలు పడుతున్నట్లు వెదురు కుప్పం మండలం ఎస్టీ కాలనీకి చెందిన ప్రజలు వాపోయారు. ఈ మేరకు వారు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. తమ కాలనీకి మూడు కిలోమీటర్ల వరకు రోడ్డు లేకపోవడం రాకపోకలకు అవస్థలు పడుతున్నట్లు చెప్పారు. కృష్ణమ్మ, సరోజమ్మ, సహదేవుడు, తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం ఎస్టీ కాలనీకి చెందిన ప్రజలు

నా ఇల్లు అమ్మేశారు



తన పేరుతో ఉన్న ఇంటిని తన కుమారుడు జయకుమార్ తనకు తెలియకుండా అమ్మేశాడని బాధితురాలు సీతామహాలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. పలమనేరులోని 973/ఏ20 సర్వే నంబర్‌లో ఉన్న ఇంట్లో 20 ఏళ్లుగా నివసిస్తున్నట్లు తెలిపారు. తన భర్త కేశవులు మృతి చెందడంతో ఇల్లు తన పేరుతో ఉందన్నారు. తనకు తెలియకుండా ఇంటిని మరొకరికి విక్రయించి తనను ఇంటి నుంచి బయటకు పోవాలని బెదిరిస్తున్నారన్నారు.

– బాధితురాలు సీతామహాలక్ష్మి

సర్వేయర్ అడ్డుకుంటున్నారు



తనకు కేటాయించిన భూమిలో సర్వే చేయనివ్వకుండా సర్వేయర్ అడ్డుకుంటున్నట్లు చౌడేపల్లి మండలం పాదలపల్లికు చెందిన రాజశేఖర్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ సైనికుడిగా 20 ఏళ్లపాటు సేవలందించిన తనకు ప్రభుత్వం 3.20 ఎకరాలు మంజూరు చేసిందన్నారు. తనకు కేటాయించిన భూమిని వేరొకరు ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాల్సిన సర్వేయర్ తమను సర్వే చేయనివ్వకుండా ఇబ్బంది పెడుతున్నట్లు ఆరోపించారు. విచారణ చేసి న్యాయం చేయాలని ఆయన కోరారు.

– బాధితుడు రాజశేఖర్.

పీహెచ్‌సీ వైద్యుల సమ్మె ప్రారంభం

- జీఓ 85ను రద్దు చేయాలంటూ డిమాండ్
- కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి సేవలు
- నేటి ప్రభుత్వ నిర్వాకానికి నిరసనగా సమ్మె ప్రారంభం
- ఈ నెల 16 నుంచి నిరవధిక నిరాహారదీక్షలు

పుత్తూరు: జీఓ 85ను వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్స్ అసోసియేషన్ (ఏపీపీహెచ్‌సీడీఏ) ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పీహెచ్‌సీ డాక్టర్లు, ఇతర సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి దశలవారీ సమ్మెను ప్రారంభించారు. ఈ సందర్భంగా పుత్తూరు మండలం గొల్లపల్లి పీహెచ్‌సీ డాక్టర్ ఎస్‌ఎం ప్రవీణ్ మాట్లాడుతూ జీఓ 85 కారణంగా తమ మూడేళ్ల సర్వీసును కోల్పోవాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. తమ వృత్తి ప్రగతికి విఘాతం కలిగిస్తూ ప్రభుత్వం అకస్మాత్తుగా జీఓను మార్చడం అన్యాయమన్నారు. ఈ జీఓతో పీజీ అడ్మిషన్లలో 30 శాతంగా ఉన్న క్లినికల్ పీజీ సీట్లు 15 శాతానికి తగ్గించడం, అలాగే 50 శాతంగా ఉన్న నాన్ క్లినికల్ పీజీ సీట్లను 30 శాతానికి తగ్గించడంతో రాష్ట్రంలోని పీహెచ్‌సీల్లో పని చేస్తున్న 2,500 మంది డాక్టర్లు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఈ జీఓను రద్దు కోరుతూ గత రెండు నెలలుగా ప్రభుత్వానికి వినతులందించినా స్పందన కరువైందన్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 10 నుంచి దశలవారీ సమ్మెను ప్రారంభించినట్లు వెల్లడించారు. మంగళవారం డాక్టర్లు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి పీహెచ్‌సీల ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈనెల 11,12 తేదీల్లో నల్ల బ్యాడ్జీలతో విధులు నిర్వహిస్తామన్నారు. 13, 14 తేదీల్లో అత్యవసర సర్వీసులు మినహాయించి, ఇతర వైద్య సేవలు నిలిపేస్తామన్నారు. 15వ తేదీన చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. 16వ తేదీ నుంచి జీఓ 85 రద్దు చేసేంత వరకు నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఏఆర్ చైతన్య, స్టాఫ్ నర్సులు సుమలత, శోభారాణి, ఫార్మాసిస్ట్ నీలవేణమ్మ తదితరులు పాల్గొన్నారు.



పుత్తూరు: గొల్లపల్లి పీహెచ్‌సీ వద్ద నల్లబ్యాడ్జీలతో డాక్టర్ల నిరసన

ఒడి పంచిన అమ్మ.. ఆదరణ కరువై..



- వివరాలు కూడా చెప్పుకోలేని స్థితిలో వృద్ధురాలు
- మూడురోజులుగా అంగడి మెట్లపైనే

అల్లారు ముద్దుగా పెంచింది.. ఆప్యాయంగా గోరుముద్దలు తినిపించింది.. ఆస్తులిచ్చింది.. ఆనందంగా జీవించమంది.. జీవిత చరమాంకంలో అమ్మకు ఆసరాగా నిలవాల్సిన కన్నబిడ్డలు ఆమెను భారంగా భావించారు. నిలువ నీడనిచ్చిన తల్లికి నీడే లేకుండా చేశారు.. ఫలితం ఆ మాతృమూర్తి ఆదరణ కరువై.. అంగడి మెట్టే ఆవాసంగా ఉంటోంది. ఈ హృదయవిదారక సంఘటన నగరిలో వెలుగు చూసింది.

నగరి : తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఆత్మీయ పలకరింపునకు దూరమై అనాథలుగా మారుతున్నారు. తామెవరో.. ఎక్కడి నుంచి వచ్చామోనన్న విషయం కూడా తెలియక జీవిస్తున్నారు. దయార్థ హృదయాలు అందించే ఆహారం తింటూ మూసి ఉంచిన దుకాణాల వద్ద, పాడుపడిన బస్‌షెల్టర్ల వద్ద కాలం గడిపేస్తున్నారు. ఇలాంటి ఒక వృద్ధురాలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న కాంప్లెక్స్‌లో మూసి ఉంచిన దుకాణం ముందు మూడు రోజులుగా ఉంది. స్థానికులు ఎక్కడి నుంచి వచ్చావు, ఎందుకు వచ్చేశావని అడిగినా సమాధానం చెప్పే పరిస్థితిలో లేదామె. పేరు అడిగినా చెప్పలేక ఏదో ఒక సమయంలో మాత్రం రేణుక అని చెబుతోంది. అదే ఆమె పేరా? లేక ఏదైనా పేరు గుర్తుంచుకుని చెబుతోందా తెలియడం లేదు. సమీపంగా ఉన్న దుకాణ యజమానులు, స్థానికులు ఆమెకు నీళ్లు, ఆహారం అందించగా అవి తిని మెట్లపై పడుకొని కాలం వెళ్లదీస్తోంది. ఆమె ఎవరో గుర్తించిన వారు ఆమెను నివాసానికి చేర్చాలని లేదా ప్రభుత్వ అధికారులైనా అనాథ ఆశ్రమానికైనా తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ

ఆర్మీ జవాన్ మృతి

- సెలవులకు వచ్చి అనంత లోకాలకు..
- మరో యువకుడి పరిస్థితి విషమం



చంద్రశేఖర్‌రెడ్డి (ఫైల్)

గంగవరం: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆర్మీ జవాన్ మరణించాడు. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. మంగళవారం రాత్రి ఈ సంఘటన పలమనేరు – బెంగుళూరు జాతీయ రహదారిలోని గజారామం వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. పలమనేరు మండలం కొలమాసనపల్లె పంచాయతీ నడిం కల్లాడు గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి(22) ఏడాది క్రితం ఆర్మీలో చేరాడు. పండుగకు సెలవు లభించడంతో స్వగ్రామానికి వచ్చాడు. కర్ణాటకలోని నంగిలి వద్ద గుమ్మకల్లులో నివాసం ఉంటున్న అమ్మమ్మను చూసేందుకు తన స్నేహితుడు పూర్ణచంద్ర(23తో కలిసి ద్విచక్ర వాహనంలో వెళ్లాడు. అమ్మమ్మతో ముచ్చటించి తిరుగు ప్రయాణమయ్యాడు. పలమనేరు వైపు వస్తూ మార్గమధ్యంలోని గజారామం ఫారెస్ట్ చెక్ పోస్ట్ సమీపంలో మృత్యువు గుర్తుతెలియని వాహనం రూపంలో ఎదురైంది. వీరి బైక్‌ను వాహనం ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వారిని హుటాహుటిన పలమనేరు ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో చంద్రశేఖర్‌రెడ్డి మృతి చెందాడు. పరిస్థితి విషమించిన పూర్ణచంద్రకు పలమనేరులో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కుప్పం పీఈఎస్‌కు రెఫర్ చేశారు. సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన వాహనం ఏదనేది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

పాత కక్షలతో దారి మూసివేత

ఐరాల: మండలంలోని కామినాయనపల్లెలో పాత కక్షలతో కొంతమంది దౌర్జన్యంగా పొలాలకు వెళ్లే దారిని మూసివేశారు. దీంతో బాధిత రైతు కుటుంబం మంగళవారం ఐరాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరహారదీక్షకు పూనుకుంది. బాధిత రైతు సుధాకర్‌నాయుడు కథనం మేరకు.. మండలంలోని పుత్రమద్ది రెవెన్యూ గ్రామం పరిధిలోని 272/3 సర్వే నంబర్‌లో 0.57 సెంట్ల భూమిలో ఆరుగురు రైతులకు వాటా ఉంది. సాగు చేసే ఈ భూమి మధ్యలో పంట కాలువలున్నాయి. పంట కాలువ ద్వారా రైతులందరూ తమ పొలాలకు వెళ్లేవారు. వీరికి గత కొంత కాలంగా భూముల విషయంపై ఘర్షణ పడుతున్నారు. ఈ భూముల విషయంగా కోర్టులో కేసులు జరుగుతున్నాయి. సుధాకర్‌నాయుడు గత ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ అనుకూలంగా పనిచేశారని కక్షతో కొంత మంది కూటమి నాయకులు పొలాలకు వెళ్లే దారికి ముళ్ల కంచె వేసి మూసివేశారు. దీనిపై సుధాకర్‌నాయుడు భార్య నవనీత, కుమారుడు ప్రసాద్, కుమార్తె లక్ష్మీప్రసన్న, వారి అన్న పురుషోత్తంనాయుడు కుటుంబ సభ్యులందరూ మూకుమ్మడిగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. దారి సమస్య పరిష్కారించే వరకు ఇక్కడి నుంచి కదలబోమని బాధిత రైతు కుటుంబం భీష్మించుకుంది. దీనిపై ఐరాల ఎస్‌ఐ నరసింహులు దీక్షలో ఉన్న రైతు కుటుంబంతో మాట్లాడి దారి సమస్యపై వాకబు చేశారు. కానీ రెవెన్యూ అధికారులు నిరసన చేస్తున్న బాధిత రైతు కుటుంబాన్ని పట్టించక పోవడం శోచనీయం.

టీచర్లు బాధ్యతగా పనిచేయాలి

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్లు బాధ్యతగా విధులు నిర్వర్తించి ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు ఉత్తమ విద్యాబోధన చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఉపాధ్యాయ సంఘ నాయకులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ తన దృష్టికి వచ్చే ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి గంటామోహన్ మాట్లాడుతూ టీచర్ల రెగ్యులరైజేషన్ జాబితాలు విడుదల, సీఎంసీ ఆసుపత్రి మెడికల్ బిల్లుల సమస్య, రివర్షన్ ఆర్డర్స్, పనిసర్దుబాటు ప్రక్రియలో లోటు పాట్లు సమస్యలను పరిష్కరించాలని కోరారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ మాట్లాడుతూ సీనియార్టీ జాబితాలు లేకపోవడంతో టీచర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఎస్టీయూ, యూటీఎఫ్ సంఘ నాయకులు కలెక్టర్ ను దుశ్శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ గ్లోరియా, నాయకులు మదన్‌మోహన్‌రెడ్డి, సోమశేఖర్ నాయుడు, హేమచంద్రారెడ్డి, ఎస్పీ భాషా, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

విశ్వకర్మ యోజన పథకంపై అవగాహన కల్పించండి

పీఎం విశ్వకర్మ పథకం పట్ల క్షేత్రస్థాయిలో అవగాహన పెంచాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. ఎంపీడీఓలు, ఇతర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం విశ్వకర్మ యోజన పథకం ను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి అర్హులకు పథకం దక్కేలా చర్యలు చేపట్టాలన్నారు. డీఆర్డీఏ, మెప్మా పీడీ లు తులసి, రాధమ్మ, డీపీఓ లక్ష్మీ, డీఎల్‌డీఓ రవికుమార్ పాల్గొన్నారు.